ప్రజాశక్తి
సోమవారం 16 సెప్టెంబరు, 2024 5
శ్రీకాకుళం



పలు డివిజన్లకు డిఎస్‌పిల నియామకం

శ్రీకాకుళం ప్రతినిధి : జిల్లాలో పలు డివిజన్లకు కొత్త డిఎస్‌పిలను నియమిస్తూ... డిజిపి ద్వారకా తిరుమలరావు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. కాశీబుగ్గ డిఎస్‌పిగా ఎ.బి.జి.తిలక్‌ను నియమించారు. ఈయన గతంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పిగా పనిచేశారు. 2022లో సిఐడి విభాగంలో రాజమండ్రి డిఎస్‌పిగా పనిచేశారు. శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పిగా బి.రాజశేఖర్‌ను నియమించారు. ప్రస్తుతం విఆర్‌లో ఉన్న ఈయనకు పోస్టింగ్ ఇచ్చారు. తొలుత ఎస్‌ఐగా పనిచేసి అంచెలంచెలుగా డిఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొందారు. ఆర్‌టిసిలో స్పెషల్ డ్రైవ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. కర్నూలు జిల్లా పోలీస్ కేంద్రంలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. శ్రీకాకుళం పోలీస్ శిక్షణా కేంద్రం డిఎస్‌పిగా విఆర్‌లో ఉన్న డి.ఎన్.వి.ప్రసాద్‌ను నియమించారు. ఈయన గతంలో విజయవాడ నార్త్‌జోన్ ఏసిపిగా పనిచేశారు.

నిబంధనలకు పాతర

- ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా లేఅవుట్లు
- రిజిస్ట్రేషన్లు చేయొద్దని అధికారులకు సుడా లేఖ
- రోడ్లు, మౌలిక వసతులు కల్పించబోమని స్పష్టంచేసిన పంచాయతీ అధికారులు
- లెక్కచేయని తోటవాడ 'రియల్' యజమానులు

గ్రామాల్లో రైతుల నుంచి కారు చౌకగా భూములు కొంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాటిని ఇష్టానుసారంగా లేఅవుట్లుగా మార్చేస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనలకు పాతర వేస్తున్నారు. లేఅవుట్లలో తాగునీరు, సక్రమంగా రోడ్లు నిర్మించకుండానే ప్లాటన్లు విక్రయిస్తున్నారు. పార్కులు, కమ్యూనిటీ హాళ్లల్లో కొంతమేర స్థలాన్ని కేటాయించాల్సి అరకొరగా వాటి కోసం స్థలం వదులుతున్నారు. అనుమతులేకపోవడంతో వాటిని రిజిస్ట్రేషన్ చేయొద్దని ఇప్పటికే అధికారులకు సుడా లేఖ రాసింది. అనధికారిక లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్, తాగునీరు కల్పించబోమంటూ ఇప్పటికే పంచాయతీలు అధికారులు స్పష్టం చేశారు. బూర్జ మండలం తోటవాడ రియల్ ఎస్టేట్ యజమానులు లెక్క చేయకుండా అమ్మకాలు సాగిస్తున్నారు.



విద్యుత్ టవర్ ప్రాంతంలో కనిపించని గ్రీన్ జోన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

బూర్జ మండలం తోటవాడ లేఅవుట్లలో కనీసం నిబంధనలు పాటించడం లేదు. లేఅవుట్లు, ప్లాట్ల విభజనకు సంబంధించి ప్రభుత్వం 'ది ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ డవలప్‌మెంట్ రూల్స్ 2017' పేరుతో జూలై 18, 2017లో జిఒ నంబరు 275 విడుదల చేసింది. ఇవి మెట్రోపాలిటిన్ సిటీల నుంచి పంచాయతీల వరకు వర్తిస్తుందని అందులో పేర్కొంది. ఏ వ్యక్తి లేదా సంస్థ సంబంధిత సంస్థ అనుమతి లేకుండా ల్యాండ్ అభివృద్ధి చేయకూడదని స్పష్టంగా పేర్కొంది. లేఅవుట్లకు సంబంధించి తొలుత ఆన్‌లైన్‌లో సంబంధింత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. ప్లాన్ డాక్యుమెంట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. లేఅవుటు తుది ప్లాన్‌లో అంతర్గత అభివృద్ధి పనుల కోసం 15 శాతం మేర స్థలాన్ని మార్టుగేజ్ చేయాల్సి ఉన్నా... దానిని అమ్ముకుంటోంది. లేఅవుట్ విస్తీర్ణం 12.5 ఎకరాలు ఉంటే అందులో రెండు శాతం స్థలాన్ని కమ్యూనిటీ హాల్, పార్కు వంటి నిర్మాణాలకు వినియోగించాలి. ఇక్కడ 32 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో లేఅవుటు వేశారు. అంటే ఆరు ఎకరాల స్థలం విడిచిపెట్టాలి. కానీ, ఇక్కడ అర ఎకరా కూడా అందుకు వినియోగించలేదు.

లేఅవుటులో కనిపించని జోన్ బెల్ట్ జోన్

లేఅవుటులో 0.5శాతం మేర స్థలాన్ని తాగునీటి ట్యాంకులు, కమర్షియల్ షాపుల నిర్మాణానికి ఉపయోగించాలి. లేఅవుట్ విస్తీర్ణం 12.5 ఎకరాలకు మించి ఉంటే 3 శాతం స్థలాన్ని కమ్యూనిటీ హాల్, ఒక శాతం స్థలాన్ని తాగునీటి ట్యాంకులు, కమర్షియల్ షాపుల నిర్మాణానికి వాడాలి. పది శాతం మేర స్థలాన్ని పబ్లిక్ ఓపెన్ స్పేస్‌గా ఉంచాలి. ఇవేవీ తోటవాడ లేవుట్లలో కనిపించడం లేదు. లేఅవుటులో కనీసం 40 అడుగుల రహదారి ఉండాలి. ఇక్కడ మాత్రం 20,30 అడుగుల దారులే కనిపిస్తున్నాయి. లేవుట్‌లో విద్యుత్ టవర్ లైన్లు ఉంటే రెండు వైపులా పది మీటర్ల వెడల్పు ప్రాంతాన్ని గ్రీన్ బెల్ట్‌గా అభివృద్ధి చేయాలి. లేఅవుట్‌లో కనీసం మీటరు స్థలాన్ని కూడా విడిచిపెట్టలేదు.

ఆందోళనలో కొనుగోలుదారులు

నిబంధనలకు విరుద్ధంగా తోటవాడ లేవుట్లు ఉండటంతో సుడా వాటికి అనుమతులు జారీ చేయలేదు. అక్కడ ఎవరూ ప్లాట్లు కొనుగోలు చేయొద్దని బహిరంగ ప్రకటన సైతం విడుదల చేసింది. వీటిపై సుడా ఇప్పటికే పలుశాఖలకు లేఖలు రాసింది. ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయొద్దని సంబంధిత అధికారులను కోరింది. పంచాయతీపరంగా రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించొద్దంటూ పంచాయతీ అధికారులకు లేఖ పంపింది. లేఅవుట్‌లోని ప్లాట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వొద్దంటూ విద్యుత్‌శాఖ అధికారులను కోరింది. దీంతో ఇప్పటివరకు ప్లాట్లను కొనుగోలు చేసిన వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేది లేదు



సుడా గుర్తించిన అనధికార లేఅవుట్లలోని ప్లాట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వం. సుడా పేర్కొన్న అనధికార అక్రమ లేఅవుట్ల జాబితాను సిబ్బందికి పంపి తగు ఆదేశాలు ఇస్తాం. ప్లాట్లను కొనే ముందు అన్ని అనుమతులు ఉన్నాయో లేదో చూసుకోవాలి.

- ఎన్.కృష్ణమూర్తి, ఎపి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఇ



మాట్లాడుతున్న వి.జి.కె.మూర్తి

ఉక్కు ఉద్యమానికి కలం, గళం మద్దతు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్మిక ఉద్యమానికి కవులు, రచయితలు, మేధావులు మద్దతు ప్రకటించారు. నగరంలోని గరిమెళ్ల ప్రెస్‌క్లబ్‌లో అరసం జిల్లాశాఖ ఆధ్వర్యాన జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు అధ్యక్షతన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమానికి మద్దతుగా ఉత్తరాంధ్రలో ఐక్య సంస్కృతిక పోరాట వేదికను రూపొందించాలని పిలుపునిచ్చారు. జరుగుతున్న ఉద్యమం కేవలం విశాఖ ఉక్కు కార్మికులకు సంబంధించినదిగానే చూడకూడదన్నారు. విశాల ప్రజా ఉద్యమం విశాఖ ఉక్కున సాధించుకుందని, ప్రతిఒక్కరూ గుర్తు చేసుకుని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ఉద్యమంతో ఏచూరికి గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా అరసం శాఖ ప్రచురించిన ఉక్కు కవనం అనే కవిత సంకలనాన్ని అతిథులు ఆవిష్కరించారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె.మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత మనకు ఎంతో నష్టం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్రానికి మిగిలిన ఏకైక భారీ ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ ఉక్కు మాత్రమేనని చెప్పారు. విశాల ఉద్యమం ద్వారా సాధించుకున్న ఈ పరిశ్రమను, ప్రయివేటీకరణ కాకుండా, మరో విశాల ఉద్యమం అవసరమని చెప్పారు. విశాఖ ఉక్కు నష్టాలు కేంద్ర ప్రభుత్వం సృష్టించేందనని అన్నారు. రా మెటీరియల్ కొరత, ఉత్పత్తి ఖర్చుల పెరుగుదల, అందులో భాగమేనని అన్నారు. సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు మాట్లాడుతూ, గత 1,314 రోజుల నుంచి ఉద్యమం జరుగుతుందని, ఉక్కు కార్మికులు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారని అన్నారు. రాష్ట్రం వెలుపల నుంచి కూడా ఉద్యమానికి మద్దతు లభిస్తుందని తెలిపారు. గంగవరం పోర్టును ఆదానికి కట్టబెట్టారని, విశాఖ ఉక్కునూ అలాగే కట్టబెట్టాలని చూస్తున్నట్లు జన సాహితీ ప్రతినిధి పి.మోహనరావు విమర్శించారు. ఇంటాక్ ప్రతినిధి వావిలపల్లి జగన్నాథనాయుడు, అరసం ఉపాధ్యక్షులు కలమట దాసుబాబు, వి.జె.కె.మూర్తి, శ్రీనివాసులు, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు తమ కవితలను చదివారు. సమావేశంలో ఇస్కఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు బుడుమూరు శ్రీరామ్మూర్తి, సాహితి కార్యదర్శి దాసరి రామచంద్రరావు, ఎఐటియుసి నాయకులు టి.తిరుపతిరావు, ప్రజా సంఘాల నాయకులు నేతింటి నీలం రాజు, డాక్టర్ బాడన దేవభూషణ్, అలపాన త్రినాథ్‌రెడ్డి మాట్లాడారు. జర్నలిస్టు సంఘాల నాయకులు ఎన్.ఈశ్వరరావు, ఎం.వి.మల్లేశ్వరరావు, జి.వి.నాగభూషణరావు, ఎస్.నాగచైతన్య, చౌదరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న అవార్డులు అందజేసేందుకు వీలుగా 2023-24 సంవత్సరానికి అవార్డులు పొందడానికి అర్హులైన పర్యాటక సంబంధిత రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా మాదిరిగానే మొత్తం 38 విభాగాల నుంచి 41 అవార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఏపీ టూరిజం వెబ్‌సైట్ www.aptourism.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసిన తర్వాత ఎపి టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ చిరునామాకు ఈ నెల 22లోగా అందజేయాలన్నారు. ఉత్తమ హోటల్ (5 స్టార్, 4 స్టార్, 3 స్టార్), ఉత్తమ బడ్జెట్ హోటల్, బెస్ట్ వే సైడ్ ఎమినిటీస్, ఉత్తమ హరిత హోటల్, ఉత్తమ పర్యావరణ అనుకూల హోటల్, ఉత్తమ థీమ్ ఆధారిత రిసార్ట్, హోటల్‌లోని ఉత్తమ రెస్టారెంట్, ఉత్తమ థీమ్ రెస్టారెంట్, ఉత్తమ స్టాండ్-అలోన్ రెస్టారెంట్, ఉత్తమ చెఫ్, ఉత్తమ చెఫ్ (ఆంధ్రా వంటకాలు), ఉత్తమ స్టాండ్-ఒంటరి కన్వెన్షన్ సెంటర్, బెస్ట్ యూనిక్ టూరిజం ప్రాజెక్టు, టూరిస్టు డెస్టినేషన్ యొక్క ఉత్తమ పౌర నిర్వహణ (పట్టణ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలు), ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాన్ని ప్రోత్సహించే ఉత్తమ జిల్లా (కలెక్టర్), ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ బీచ్, ఉత్తమ టూరిస్ట్ ఫ్రెండ్లీ రైల్వే స్టేషన్, సినిమా షూటింగ్ ఉత్తమ స్థానం, ఉత్తమ పర్యాటక అనుకూల విమానాశ్రయం, బెస్ట్ టూరిస్టు ఫ్రెండ్లీ బస్ స్టాండ్, స్థానిక పర్యాటక ప్రాజెక్టులు, టూరిజం ప్రాజెక్టు యొక్క ఉత్తమ సమగ్ర అభివృద్ధి, ఉత్తమ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్, ఉత్తమ ట్రావెల్ ఏజెంట్, ఉత్తమ ట్రావెల్ ఏజెంట్ (బోటింగ్), ల్యాండ్, ఏరో, వాటర్ స్పోర్ట్స్ కోసం బెస్ట్ అడ్వెంచర్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్ (డొమెస్టిక్), అత్యంత వినూత్నమైన ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్ (దేశీయ), టూరిజాన్ని ప్రమోట్ చేస్తున్న బెస్ట్ ఎమర్జింగ్ ట్రావెల్ కంపెనీ, ఉత్తమ పర్యాటక విద్యా సంస్థ, రచన/ప్రచురణలో శ్రేష్ఠత, ఉత్తమ టూరిస్ట్ గైడ్, ఏపీ టూరిజంపై ఉత్తమ చిత్రం, ఉత్తమ పర్యాటక ప్రమోషన్ కొలేటరల్ పబ్లిసిటీ మెటీరియల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యొక్క అత్యంత వినూత్న వినియోగం/ఉత్తమ టూరిజం వెబ్‌సైట్/పోర్టల్ ప్రమోటింగ్, ఆంధ్రప్రదేశ్ కళ, సంస్కృతి ద్వారా పర్యాటక ప్రచారం, ఎపి టూరిజాన్ని ప్రోత్సహించే ఉత్తమ బ్లాగర్/సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, విభాగాలకు అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.



గుంతలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

నెల రోజుల్లో రోడ్డు పనులు పూర్తి

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు పనులు నెల రోజుల్లో రాకపోకలకు అనువుగా మారుస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. ఆర్‌అండ్‌బి అధికారులతో కలిసి కొత్త రోడ్డు నుంచి రాగోలు వరకు రోడ్డుపై నడుస్తూ గుంతలను ఆదివారం పరిశీలించారు. అనంతరం అధికారులతో చర్చించి నెల రోజుల్లో తారు రోడ్డుని వేయించి ప్రజలకు ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కలిగించాలని ఆదేశించారు. ప్రజలకు ఈ రోడ్డు అందుబాటులోకి తీసుకురావడానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని పేర్కొన్నారు. కాంట్రాక్టర్‌ను ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి మాట్లాడామని అన్నారు. గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం, కమీషన్ల పేరుతో వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులు వేధించడంతో రోడ్డు నిర్మాణం ఆలస్యమైందని విమర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే బకాయిలు విడుదల చేసి రోడ్డు పనులు ప్రారంభించామని చెప్పారు. సాంకేతిక ఇబ్బందులు, వర్షాలు కారణంగా కొంత ఆలస్యమైందన్నారు. త్వరలో పనులు వేగవంతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నవంబరు 17న మహాసభ



ఏచూరి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కళాసీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నవంబరు 17న జిల్లా జట్టు ముఠా, కళాసి కార్మిక సంఘం జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిన్నారావు, కె.సూరయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో జట్టు ముఠా కళాసి కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీలకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. హమాలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాలకు హెచ్చరించారు. జిల్లాలో హమాలీలు అతితక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, 8 గంటల పని దినం వంటి కార్మిక చట్టాలు ఏ ఒకటీ అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ఐఎల్ఒ నిబంధనల ప్రకారం 50 కేజీలు బస్తా ఉపయోగించాలని, కానీ, జిల్లాలో ఎక్కడా ఉపయోగించడం లేదని అన్నారు. యాజమాన్యాలు కార్మికులతో అధిక బరువులు మోయించడంతో కార్మికుల అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలన్నారు. ఏడాదికి రెండు జతల బట్టలు ఇవ్వాలన్నారు. బోనస్ అమలు చేయాలన్నారు. కార్మికశాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి కార్మిక చట్టాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులందరికీ ప్రమాద బీమా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, యూనియన్ జిల్లా నాయకులు బి.చిన్నారావు, లక్ష్మీనారాయణ, పి.అప్పలరాజు, ఎల్లయ్య, డి.సూరి, డి.మహాలక్ష్మి, ఎం.నర్సింహులు కె..త్రినాథరావు, పి.రమణ పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులకు పోలీసు భద్రత

ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఎవరైనా తమ ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్లేటప్పుడు ఇంటి భద్రత కోసం జిల్లా పోలీసు శాఖ వద్ద ఉన్న లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం సాంకేతికతను వినియోగించుకోవాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సేవ పూర్తిగా ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవను వినియోగానికి ప్రజలు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్స్‌లోని LHMS AP Police యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మీ పేరు, చిరునామా, మొబైల్ నంబరు తదితర వివరాలతో ఈ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం వెంటనే ఒటిపి నంబరు వస్తుందన్నారు. ఆ నంబరుని యాప్‌లో టైప్ చేసి సబ్మిట్ చేసిన తరువాత మీ మొబైల్ నంబరుకి మీ యొక్క రిజిస్ట్రేషన్ ఐడి వస్తుందని తెలిపారు. APLHMSXXXXXఆ ఐడిని వినియోగించుకోవాలన్నారు. నమోదు చేసి రిక్వెస్ట్ పంపినట్లయితే, మీ ఇంటికి పోలీసులు వచ్చి ఇంటి లోపల మోషన్ సెన్సార్ కెమెరాను నిక్షిప్తం చేస్తారని అన్నారు. అప్పటి నుంచి ఇంటిని జిల్లా కేంద్రంలోని పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి 24/7 నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఇంటికి తాళం వేసుకుని వెళ్లే పరిస్థితిలో ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇంటి వద్ద గస్తీ, భద్రత పెంచడంతో పాటు ఇంటిలో దొంగతనాల నివారణకు ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను అమర్చి నేర నియంత్రణకు పోలీసు సిబ్బంది చర్యలు తీసుకుంటారని తెలిపారు.

కొండపోడు భూములకు పాస్ పుస్తకాలు ఇప్పించాలి

జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌కు గిరిజనుల వినతి




వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- లావేరు

తాము ఎప్పటినుంచో సాగులో ఉన్న కొండపోడు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలని లావేరు పంచాయతీ గూడెం, గోలుగులువలస గిరిజనులు కోరారు. ఎస్‌టి జాతీయ కమిసన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ శనివారం రాత్రి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు క్యాంపు కార్యాలయంలో గిరిజనులు పలు సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. జి.జి.వలస నుంచి కొండపోడు భూములు అడవిలోపల నుంచి కొండములగాం మీదగా రణస్థలానికి వెళ్లే రోడ్డు ఏర్పాలు చేయాలని కోరారు. గ్రామంలో సామాజిక భవనం, గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నారు. శ్మశాన వాటికలో షెడ్లు నిర్మించాలన్నారు. వ్యవసాయ బోర్లు మంజూరు చేసి విద్యుత్ సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేయాలని విన్నవించారు. ఎస్‌టి కమిషన్ సభ్యులు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను ప్రాధాన్యతాక్రమంగా తీసుకొని తప్పనిసరిగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ ఎచ్చెర్ల ఎఎంసి మాజీ ఛైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, గిరిజనులు తార ఉత్తరరాజు, అప్పలరాజు, గంగరాజు, ఎస్.దుర్గారావు, కన్నయ్య, మీసాల అప్పలరాముడు, దేవుడమ్మ, నారాయణరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం అర్బన్ : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో 16వ కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2024 పోటీలను రాజాం ఎమ్మెల్యే కొండ్రు మరళీమోహన్‌తో కలిసి ఆదివారం ప్రారంభిం చారు. ఏటా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వందలాది మంది క్రీడాకారులు పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. తొలుత కొన్న చిన్నారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు కంటే పోటీల్లో ప్రాతిని ధ్యం వహించడమే క్రీడాకారులు లక్ష్యం కావాలన్నారు. కార్యక్రమంలో కొన్న వెంకటేశ్వరరావు, బిజెపి అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, ఎపి అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, కొండ్రు జగదీష్, బిజెపి యువమోర్చ నాయకులు పూడి బాలాదిత్య, శివాని కాలేజ్ డైరెక్టర్ సనపల నర్సింగరావు (రాజా), తైక్వాండో శ్రీను, పిఇటిల సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ పాల్గొన్నారు.

కన్వర్జెన్సీ పనులపై దృష్టి

- పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం
- గ్రామ పంచాయతీ యూనిట్‌గా పనులు
- వ్యవసాయ రంగానికి 'ఉపాధి' తోడ్పాటు
- డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పథకం అమలుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో ప్లాంటేషన్ ప్రోగ్రాం అమలులో భాగంగా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. వాటి సంరక్షణ బాధ్యతలనూ అప్పగించామన్నారు. వ్యవసాయ రంగానికి ఉపాధి పనులు అనుసంధానం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని చెప్పారు. కన్వర్జెన్సీ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలోని 30 మండలాల్లో ఎపిఒలు, ఇసిలు, టెక్నికల్ అసిస్టెంట్లు ప్లానింగ్ ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారన్నారు. జిల్లాలో రానున్న ఆర్థిక సంవత్సరానికి గాను పనులను ముందుగానే గుర్తించామన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.


? వ్యవసాయ పనులకు 'ఉపాధి' అనుసంధానం ఎంతమేరకు జరుగుతోంది?

జిల్లాలో ఖరీఫ్ సీజన్ మొదలైన తర్వాత సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతో అన్ని ప్రాంతాలకు సాగునీరందించేందుకు వీలైంది. మరోవైపు గ్రామాల్లో అవసరమైన పనులు గుర్తించడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. మరోవైపు కన్వర్జెన్సీ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. మరోవైపు రైతాంగానికి అవసరమైన ఉద్యాన పంటల సాగుకు అవసరమైన మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నాం. వీటి సంరక్షణ బాధ్యతను రైతులకు, ఉపాధి కూలీలకు అప్పగించాం. చెరువు గట్లు, ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణల్లో ఈ ప్లాంటేషన్ ప్రోగ్రాం చేపడుతున్నాం. జిల్లాలో ఈ ప్రోగ్రాం ద్వారా ఇప్పటికే 5 లక్షల మొక్కలను సిద్ధం చేశాం.

? కన్వర్జెన్సీ పనులు ఎలా సాగుతున్నాయి?

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యాన గ్రామాల్లో అనేక రకాలైన కన్వర్జెన్సీ పనులకు గతంలో మంజూరు ఇచ్చాం. ఫాంపాండ్స్, డీసిల్టింగ్, ట్రెంచెస్, తదితర పనులు పెద్దఎత్తున మంజూరు చేశాం. గడచిన కాలంలో సిమెంట్ కట్టడాలు పెద్దఎత్తున జిల్లాలో చేపట్టాం. ప్రాధాన్యతాక్రమంలో ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి వాటిని పూర్తిచేయడంతో పాటు కొత్తగా అవసరమైన పనులు మంజూరుకు ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు గుర్తించాం. ఇంజినీరింగ్‌శాఖల ఆధ్వర్యాన పనులు గుర్తించిన తర్వాత కలెక్టర్ అనుమతితో ఈ పనులను మంజూరు చేసేందుకు వీలుంటుంది.





? 'ఉపాధి' పనుల్లో ఈ ఏడాది ఎలాంటి మార్పులు రానున్నాయి?

ఉపాధి హామీ అమలులో జిల్లా ఎల్లప్పుడూ ముందే ఉంటోంది. ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు పొట్టచేత పట్టుకుని వెళ్లే కుటుంబాలకు స్థానికంగా ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యసాధనకు ఎప్పటికప్పుడు ఈ చట్టాన్ని సమర్థవంతంగా జిల్లాలో అమలు చేస్తున్నాం. 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ఇంకా గడువు ఉన్నా... ముందస్తుగా వచ్చే ఏడాది చేపట్టబోయే పనులను గుర్తించే ప్రక్రియ మొదలు పెట్టాం. 900లకు పైగా గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో ఉపాధి పనులు గుర్తించాం.


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న దుర్గాప్రసాద్

మలకాం వాసికి గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి- పొందూరు

మండలం మలకాం (జాడపేట) గ్రామానికి చెందిన దూబాకుల దుర్గాప్రసాద్ అస్సాం యూనివర్శిటీలో ఎంఎల్ఐఎస్‌సిలో (లైబ్రేరియన్) పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో అస్సాం యూనివర్శిటీ 21వ స్నాతకోత్సవంలో ప్రతిష్టాత్మకమైన గోల్డ్‌మెడల్‌ను వైస్ ఛాన్సలర్ చేతులమీదుగా అందుకున్నాడు. ప్రస్తుం పూణేలోని క్రాష్ యూనివర్శిటీలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నాడు. ఈయన తండ్రి చిట్టిబాబు ఆర్ఎంపి వైద్యుడుకాగా తల్లి బాలమ్మ గృహిణి. దుర్గాప్రసాద్ విజయంపై తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లెనిన్ కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


లెనిన్ కుమార్

బయోటెక్నాలజీ రీసెర్చ్ రంగంలో తన విలువైన కృషికి అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ నుంచి భారతీయ బయోటెక్నాలజిస్టు డాక్టర్ లెనిన్ కుమార్ బొంపల్లికి డాక్టరేట్ అవార్డు వచ్చింది. యుసిఎ ప్రెసిడెంట్ డాక్టర్ శాంటినా డి.సాల్వో మంగళవారం అవార్డును ప్రకటించారు. బొలీవియాలోని రెండు శతాబ్దాల కంటే ఎక్కువ పురాతనమైన విశ్వవిద్యాలయం ఒక దశాబ్దపు పరిశోధనా రచనలకు డాక్టరేట్‌ను మంజూరు చేసింది. లెనిన్ కుమారుకు పోస్ట్ ద్వారా వచ్చే పది రోజుల్లో డాక్టర్ ఆఫ్ సైన్స్ అందుకుంటారు.


రామారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

సేవలే గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. హిందీ మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ జూనియర్ కాలేజీలో జరిగిన హిందీ దివస్ సభలో హిందీ ప్రచారక్, బెజ్జిపురం హైస్కూల్ హిందీ పండితులు రొంపివలస రామారావును ఉత్తమ హిందీ భాషా ప్రచారక్‌గా ఎమ్మెల్యే శంకర్ సత్కరించారు. హిందీ భాషా ప్రచారానికి గత 20 ఏళ్లుగా రామారావు చేస్తున్న కృషిని అభినందిస్తూ ఉత్తమ ప్రచారక్‌గా రామారావును ఎమ్మెల్యే గొండు శంకర్, రిటైర్డ్ డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు, మంచ్ జోనల్ కార్యదర్శి కోనే శ్రీధర్, సురంగి మోహనరావు తదితరులు శాలువ కప్పి, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహిత రామారావు మాట్లాడుతూ ఈ సత్కారం మరింత భాధ్యతను పెంచిందన్నారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎమ్మెల్యే గోవిందరావు పరామర్శ

మెళియాపుట్టి : మండలంలోని మాకనాపల్లికి చెందిన పడాల సోమేశ్వరరావు, పెద్దపద్మాపురానికి చెందిన ఎన్ని లక్ష్మీనారాయణ తల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట టిడిపి నాయకులు ఉన్నారు.


అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని బంటుపల్లిలో ఆదివారం సర్పంచ్ ఎన్. రజని, ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ ఎన్. తేజబాబు ఆధ్వర్యంలో 2 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పాతపట్నం: మండలంలోని పెద్దసీదిలో గణేష్ యూత్ ఆధ్వర్యాన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వినాయకుని ప్రాంగణంలో ఆదివారం దీపారాధన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్న పిల్లలతో ఆటలు, పాటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూ వేలం

రణస్థలం రూరల్: ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో 12 కేజీల లడ్డును వేలం వేయగా వెలిచేటి సురేష్ కుమార్, టీం సభ్యులు రూ.50 వేలుకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం, ఎస్.నాగేశ్వరావు, సిహెచ్.వెంకటరాజేష్, జి.కృష్ణారావు, టి.అప్పలరాజు, ఎం.శ్రీనివాసరావు, జి.జనార్ధన్, సప్ప గంగులు, జాడ పండు, టి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలాకి: పోలాకిలోని విశ్వేశ్వరనగర్‌లో వినాయకుని ఉత్సవాలు సందర్భంగా ఆదివారం లడ్డూను వేలం వేశారు. దీనిని పాడి లక్కోజీ నారాయణరావు దంపతులు రూ.9,500కు పాట పాడి దక్కించుకున్నారు. అలాగే వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి ఆటా, పాటలతో ఊరేగించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విశ్వకర్మ భగవానుడి గొప్పతనాన్ని గుర్తించి రాష్ట్ర పండుగగా ఈనెల 17న 'విశ్వకర్మ జయంతి'ని జరుపుకోవడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి అనురాధ తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనల మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఘనంగా మోక్షగుండం జయంతి


శ్రీకాకుళం అర్బన్ : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న హరికా ప్రసాద్


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్


శ్రీకాకుళం అర్బన్ : రక్తదానం చేస్తున్న ఇంజినీర్లు


టెక్కలి రూరల్ : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న హరేరామ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందడానికి ఇంజనీర్లు పాత్ర కీలకమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. నగరంలో ఒక ప్రయివేట్ హోటల్‌లో భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు ది ఇన్సిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ జిల్లా శాఖ అధ్యక్షులు డి.విష్ణుమూర్తి ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ కావేరి నదిపై ఆనకట్టను నిర్మించి కర్నాటక, తమిళనాడు రాష్ట్రంలో ఉన్న ఆయకట్టుకు నీరు అందించిన గొప్ప దార్శినికుడన్నారు. ఆయన సేవలను గుర్తించి బ్రిటిష్ ప్రభుత్వం సర్ అనే బిరుదు, దేశంలోనే అత్యున్నత పురస్కారం భారత ప్రభుత్వం భారత రత్న బిరుదులను ప్రధానం చేశారని గుర్తు చేశారు. ఆయనను నేటితరం యువ ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇంజినీర్స్ వి.సుధాకరరావు, పి.శ్రీహరి, వి.వి.నరసింహారావు, సిహెచ్ రమేష్, సత్యనారాయణ రాజు, ఎం.వెంకటకృష్ణ, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజినీర్లు భాగస్వామ్యం తప్పనిసరి

పురాతన కాలం నాటి భవన నిర్మాణాలు, పూడుకు పోయిన కాల్వలతో నగర ప్రజలు అవస్థలు పడుతున్నారని, నగర సుందరీకరణ జరగాలంటే ఇంజినీర్లు పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని అరసవల్లి రోడ్డులో ఉన్న ఎల్ఎన్ గ్రీన్ కన్వెన్షన్‌లో జిల్లా వెల్ఫేర్ ఇంజినీర్స్ టెక్నికల్ అసోసియేషన్ ఆధ్వర్యాన మోక్షగుండం విశ్వేశ్వరరావు జయంతి సందర్భంగా ఇంజినీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ మానవ ప్రగతి ప్రస్థానంలో ఇంజినీరింగ్ రంగానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఆనకట్టలు, డ్యాంలు, రైల్వే వంతెనలు, సొరంగ మార్గాలు, రహదారులు ఇలా ఎన్నింటినో ఇంజినీరింగ్ నిపుణులు తమ అసాధారణ ప్రతిభతో సాధించగలిగారన్నారు. అత్యున్నత శిఖరాలను అధిరోహించి, ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాలను ఆవిష్కరించిన ఘనత భారత ఇంజినీర్లకే దక్కిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ముని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు దుంగ సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ విజయకుమార్, డి.వి.రమణ, బి.వి.రమణ, వై.రాజేష్, క్రిథాయ్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, సుడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి తరం ఇంజినీర్లకు మోక్షగుండం స్ఫూర్తి

పట్టణంలో మీనా కృష్ణ పంక్షన్ హాల్‌లో 57వ ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ లైసెన్స్ డే టెక్నికల్ పర్సన్స్ అఫ్ ఎపి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళ్లర్పించారు. అధ్యక్షులు హరికా ప్రసాద్ మాట్లాడుతూ సర్ శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజినీర్స్ డే గా జరుపుకోవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మేజిక్ షో, కల్చరల్ ప్రోగ్రామ్స్ ఆకట్టుకున్నాయి. వెంకటేష్, బి.సత్యనారాయణ, బాకి సురేష్, శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, మూర్తి, గోపి, హరి, హారిక కన్‌స్ట్రక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ మందిరంలో

నగరంలోని శాంతినగర్ కాలనీలో స్వాతంత్ర సమరయోధుల స్మృతివరంలో లైసెన్స్ టెక్నికల్ ఇంజినీర్స్ అసోసియేషన్ బృందం నెలకొల్పిన మోక్షగుండం విగ్రహానికి హారికా ప్రసాద్‌తో పాటు బృంద ప్రతినిధులు గాంధీ మందిర్ కమిటీ సభ్యులు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా హారికా ప్రసాద్, బూర్ల సత్యనారాయణ, వాండ్రంగి శ్రీనివాసరావు తదితరులు విశ్వేశ్వరయ్య సేవలను కొని యాడారు. అనంతరం అసోసియేషన్ బృంద ప్రతి నిధులను గాంధీ మందిర కమిటీ పెద్దలు బరాటం లక్ష్మణరావు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, భట్లు, శంకరరావు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వి.శ్రీనివాసరావు, ఎస్‌విఆర్ మూర్తి, రవికుమార్, ఆచంట రాము, సంతోష్ బాబు, రామకృష్ణ, రామానాయుడు పాల్గొన్నారు

ఇంజినీర్లు రక్తదానం

విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని పంచాయతీ రాజ్ ఇంజినీర్ల జెఎసి ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించి ఈ శిబిరాన్ని జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్ ప్రారంభించారు. 47 మంది రక్తదానం చేశారు. అంతకు ముందు జెడ్‌పి ఆవరణలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళ్లర్పించారు. బెహరా మనో వికాస కేంద్రంలో మానసిక వికలాంగులకు పండ్లు, రూ.5,116 ఆర్థికసాయాన్ని జెఎసి సెక్రటరీ జనరల్ కెసిహెచ్ మహంతి చేతులమీదుగా అందజేశారు. గడచిన 11 రోజులుగా వివిధ యూనిట్ల స్థాయిలో జరిగిన క్రీడల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఐకాస నాయకులు ఎస్. రామకృష్ణ, ఎస్.శ్రీరాములు, పోలినాయుడు, కెఎస్ భరత్, పూర్వపు ఎస్ఇలు ఎ.ప్రభాకరరావు, జి.ఎస్ఆర్ గుప్త, ఇఇ ఎఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి హైదరాబాద్‌కు చెందిన కె.ఎం.వి.ప్రాజెక్టు వైస్ ప్రెసిడెంట్ హరేరామ్ పెందుర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు డిఇఇ డి.ఆశాలత, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, సివిల్ హెచ్ఐఒడి డాక్టర్ పి.దినకర్ కన్వీనర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కోరారు. అనంతరం ఇంజినీరింగ్ దినోత్సవం సందర్భంగా సిబ్బందికి పలు క్రీడా పోటీలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీల్లో, రీచెర్చ్ పోలీసులు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

నేడు 'మీకోసం' రద్దు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 16న నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మిలాదిన్ నబీ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో మీకోసం నిర్వహించడం లేదని వివరించారు. జిల్లాలో ప్రజలు వ్యయప్రయాసలకులోనై వినతులు అందజేయడానికి హాజరు కావద్దని సూచించారు.

హిందీకి ప్రాధాన్యత ఇవ్వాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

తెలుగు భాషకు సమాంతరంగా హిందీ భాషను నేర్చుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం నగరంలో శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో హిందీ మంచ్ ఆధ్వర్యంలో హిందీ దివస్ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పురాతన చరిత్ర కలిగిన తెలుగు భాషను కాపాడు కుంటూ హిందీ భాషను కూడా నేర్చుకుంటే జాతీయస్థాయిలో ఉపయోగ పడుతుందన్నారు. మాతృభాషను అభివృద్ధి చేసుకుంటూ హిందీ భాషను కూడా నేర్చుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలో పాఠశాలల విద్యార్థులకు హిందీ భాష రాతపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. భవిష్యత్‌లో తెలుగు భాషను మరింత అభివృద్ధి చేసుకుంటూ హిందీ భాషను కూడా నేర్చుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో శాంతినికేతన్ కళాశాల యాజమాన్యం కొర్ను నాగార్జున ప్రతాప్, సురంగి మోహనరావు, హిందీ మంచ్ ప్రతినిధులు కోనే శ్రీధర్, బలివాడ మల్లేశ్వరరావు, డాక్టర్ దానేటి శ్రీధర్, కళాశాల అధ్యాపకులు, హిందీ భాషా అభిమానులు, టిడిపి నాయకులు రెడ్డి గిరిజ శంకర్, గొండు శ్యామ్, ఎండు చిన్నారావు, జి దామోదర్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

టెక్కలి : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా టెక్కలి డివిజన్ ఉప విద్యా శాఖ అధికారి విలియం, టెక్కలి, నందిగాం ఎంఇఒలు హనుమంతు శివానంద, తులసిప్రసాద్, శ్రీనివాసరావులు ఎంపికయ్యారు. వీరికి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు రోనంకి రామ చందరరావు, ధనుంజయరావు, జి.వి.రెడ్డి మస్టారు, గంట లీలావరప్రసాద్, రోనంకి శ్రీనివాసరావు, షావుకారి నారాయణమూర్తి, హనుమంతు నాగేశ్వరరావు, నంబూరి భాస్కరరావు పాల్గొన్నారు.

ఇందిరా విజ్ఞాన్ భవన్‌ను సందర్శించిన రాకేష్ రెడ్డి


మాట్లాడుతున్న రాకేష్ రెడ్డి

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఈనెల 10న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన సంభవించిన ప్రమాద స్థలాన్ని ఎఐసిసి సభ్యులు, పిసిసి వర్కింగ్ కమిటీ మాజీ అధ్యక్షులు పి.రాకేష్ రెడ్డి సందర్శించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పూర్వపు అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు సమక్షంలో పరిశీలించిన ఆయన పార్టీలో అంతర్గత విభేదాలకు తావిస్తూ కొత్త అధ్యక్షులు అంబటి కృష్ణారావు పోలీసులకు ఫిర్యాదు చేయడం అభ్యంతరకరమన్నారు. తోటి నాయకత్వంపై బురదజల్లే సంస్కృతి సరికాదన్నారు. పిసిసి అధ్యక్షులు షర్మిల పేరును ఆయన ప్రస్తావించడం సరికాదన్నారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో అసలు సిసలైన కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను బయటకు పంపే కుట్ర జరుగుతుందని, అందులో ఇటువంటి తప్పుడు ఫిర్యాదులు భాగమని ఆయన స్పష్టం చేశారు. శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్ వివేకానంద, సిఐ కె.పైడపు నాయుడులను కలిసి కేసు పారదర్శకంగా నిజాయితీగా దర్యాప్తు జరపాలని ఆయన కోరారు. ఆయన వెంట విశాఖ డిసిసి మాజీ అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, అనకాపల్లి డిసిసి మాజీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావు, విజయనగరం డిసిసి మాజీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జాతీయ విభాగం నాయకులు బమ్మిడి గంగాధరరావు, చెన్న అప్పారావు, ఎచ్చెర్ల, ఆమదాలవలస, పాతపట్నం, ఇచ్ఛాపురం నియోజక వర్గాల ఇన్‌ఛార్జిలు కరిమజ్జి మల్లేశ్వరరావు, సనపల అన్నాజీరావు, కొప్పురోతు వెంకటరావు, మాసుపత్రి చక్రవర్తి రెడ్డి, మామిడి సత్యనారాయణ, ఎ.వెంకట్ నాయుడు, బద్రి సీతమ్మ, పి.సూర్యనారాయణ, కొత్తకోట జోగినాయుడు, ఇజ్జురోతు రమణ పాల్గొన్నారు.


శుభరాట వేస్తున్న కమిటీ సభ్యులు

దసరా ఉత్సవాలకు శుభరాట

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం గ్రామ దేవత స్వేచ్ఛా వతి అమ్మవారి ఆలయంలో అక్టోబరు మూడు నుంచి నిర్వహించనున్న దసరా నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం శుభరాట వేశారు. ఏటా క్రమం తప్పకుండా అమ్మవారి ఆలయంలో దేవి నవ రాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగం గానే ఈ ఏడాది దేవీనవరాత్రులు వైభోపేతంగా నిర్వహి ంచేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

వినాయకునికి ఆరడుగుల అగరుబత్తి


అగరుబత్తిని వెలిగిస్తున్న కమిటీ సభ్యులు

ఇచ్ఛాపురం : పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం వద్ద సైకిల్ బ్రాండ్‌కి చెందిన ఆరు అడుగుల భారీ అగర బత్తి వెలిగించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా భారీ వినాయక విగ్రహం అందరినీ ఆకట్టుకుంటుంది. 19 ఏళ్లగా క్రమం తప్పకుండా భారీ విగ్రహాలు ఏర్పాటు చేస్తూ... వస్తున్నారు. కమిటీ సభ్యులు విరాళాలు మినహా బయట ఎక్కడా చందాలు వసూలు చేయకుండా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మైసూర్‌కు చెందిన సైకిల్ బ్రాండ్ కంపెని స్థానిక బెస్ట్‌మార్ట్ డిపార్ట్‌మెంట్ షాపుకు పంపించడంతో గణేష్ మండపం వద్ద వెలిగించారు.

30న సొసైటీ సర్వసభ్య సమావేశం

పోలాకి: ఈ నెల 30న పోలాకి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సిఇఒ బి.రాంబాబు తెలిపారు. సొసైటీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సొసైటీ కార్యాలయంలో ఉదయం పది గంటలకు సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశానికి కార్యవర్గ సభ్యులు, సంబంధించిన అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎమ్మెల్యే రవికుమార్‌తో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పొందూరు: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో కొన్న చిన్నారావు మెమోరియల్, రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ సెలెక్షన్స్‌లో మండలంలోని లోలుగు కెజిబివి విద్యార్థినిలు షాట్ పుట్‌లో కె.జానకి, ఎం.ద్రాక్ష, జావిలన్ త్రోలో వై.రమ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రూపవతి తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన ఈ పోటీలో అండర్-16 విభాగంలో కె.జానకి షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, జావలిన్ త్రోలో తృతీయ స్థానం, అలాగే అండర్-18 విభాగంలో ఎం.ద్రాక్ష షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, వై.రమ జావలిన్ త్రోలో రెండో స్థానం, పి.భవాని లాంగ్ జంప్‌లో మూడో స్థానం, హై జంప్‌లో మూడో స్థానం, కె.ఇందు లాంగ్ జంప్‌లో రెండో స్థానంలో నిలిచి తమ ప్రతిభను చాటారు. విద్యార్థినిలకు ఎమ్మెల్యే కూన రవికుమార్ చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిను లను ప్రిన్సిపాల్ సౌమ్య, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.


విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ఉద్యోగులు

'రోణంకి' జయంతి

ప్రజాశక్తి- టెక్కలి

బహుభాషా కోవిదులు ఆచార్య రోణంకి అప్పలస్వామి జయంతి వేడుక ఆదివారం టెక్కలిలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని రోణంకి విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం, సాహిత్య సాంస్కృతిక సమైక్య, ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యాన ఈ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల డాక్టర్ అంబేద్కర్ యూనివర్సిటీ జర్నలిజం విభాగం హెచ్ఒడి గుంట లీలావరప్రసాద్, అప్పలస్వామి మనుమడు రాణంకి శ్రీనివాస్, విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రోనంకి రామచందరరావు, ధనుంజయరావు హనుమంత నాగేశ్వరరావు, సత్తారు రాంబాబు, ఎన్.భాస్కరరావు, షావుకారి నారాయణమూర్తి, సాహిత్య సాంస్కృతిక సమైక్య అధ్యక్షులు బొడ్డ అయ్యాబాబు, జి.వి.రెడ్డి, మాస్టర్ దల్లి వీరస్వామిరెడ్డి, ప్రజా చైతన్య కళా సమితి నుంచి చిలుకు కృష్ణారావు ఆంధ్రా స్టాలిన్ మూల తాతయ్య, అనిశెట్టి చిట్టన్న, గణపతిరావు పాల్గొన్నారు.

సరియా జలపాతంలో మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)

అనంతగిరి మండలంలోని సరియా జలపాతంలో శనివారం గల్లంతైన ఇద్దరి మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. వారు శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం ప్రాంతానికి చెందిన ఇండియన్ నేవీ ఉద్యోగి సాయికుమార్, దినేష్ కుమార్‌లుగా పోలీసులు గుర్తించారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన సరియా జలపాతాన్ని తిలకించేందుకు వారు వచ్చి గల్లంతయ్యారు. అనంతగిరి ఎస్ఐ కె.రాము, ఉప తహశీల్దార్ మాణిక్యం, దేవరాపల్లి ఎస్ఐ మల్లేశ్వరరావుల ఆధ్వర్యాన ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు వారి కోసం గాలించిన విషయం తెలిసిందే.


మాట్లాడుతున్న అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు

గంజాయితో ముగ్గురు అరెస్టు

అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు చేస్తే ఎవ్వరినీ విడిచిపెట్టేది లేదని జిల్లా అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక సిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గంజాం జిల్లా మోహన గ్రామం నుంచి అక్రమంగా గంజాయి బస్తాలు సూట్ కేస్‌లో తరలిస్తుండగా ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ముగ్గురు నిందితుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారని, రెస్మా నాయక్, సుమిత నాయక్, గజేంద్ర నాయక్‌ను అరెస్టు చేసి 32 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరు గంజాం జిల్లా మోహన నుంచి గంజాయితో ఇచ్ఛాపురం రైల్వేస్టేషను నుంచి ముంబయి వెళ్లేందుకు వెళ్తున్న సమయంలో స్టేషన్ సమీపంలో అరెస్టు చేయడం జరిగిందన్నారు. నిందితులు గంజాయి తీసుకోని వెళ్లి ముంబాయిలో మరో వ్యక్తికి అప్పగిస్తారన్నారు. కేజీ రూ.వెయ్యి చొప్పున తీసుకుని చెప్పిన చోట గంజాయి ఇస్తారన్నారు. తొందరగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఇటువంటి పనులకు పాల్పడుతున్నారన్నారు. అసలైన డిస్ట్రిబ్యూటర్లపై గట్టి నిఘా పెట్టామని తొందర్లోనే అరెస్టు చేస్తామన్నారు. వరుసుగా గంజాయి నిందితులను పట్టుకోవడంలో మంచి ప్రతిభ చూపిస్తున్న అధికారులు, సిబ్బందికి ఎస్‌పి నగదు రివార్డు ప్రకటించారని ఆయన తెలిపారు. గంజాయికి సంబంధించి సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమావేశంలో సిఐ మీసాల చిన్నం నాయడు, పట్టణ ఎస్ఐ చిన్నం నాయడు ఉన్నారు.

రూ.20 వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.20వేలు సేకరించి సిఎం సహాయ నిధికి అందజేశారు. ఈమేరకు ఆదివారం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి చెక్కును అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ

వజ్రపుకొత్తూరు: వజ్రపు కొత్తూరు ఎస్ఐగా బి.నిహార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పనిచేసిన సిహెచ్.రామారావు విఆర్‌లోకి వెళ్లారు. నిహార్ సరుబుజ్జిలి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, గోవిందపురం సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమామహేశ్వరరావు అభినందనలు తెలిపారు. సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.


వృద్ధులకు ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న వెంకటేష్

సామాజిక కార్యక్రమాలతో సంతృప్తి

ఆమదాలవలస : సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి, ఆనందం కలుగుతుందని కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. ఆదివారం సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురానికి చెందిన టిడిపి యువ నాయకుడు కిల్లి శేషు మోహన్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని లెపర్సీ కాలనీలోని పేదలు, వృద్ధులు, వికలాంగులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరెన్నో కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఆనంద్, రాము, లక్ష్మణ్, సాయి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా సుబ్రహ్మణ్యం

శ్రీకాకుళం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ అసోసియేషన్ 2024-2025 నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో జరిగాయి. ఎన్నికల అధికారిగా ఎన్.కిరణ్ కుమార్, రాష్ట్ర పరిశీలకులుగా బిఎస్ నాయుడు, బోనెల గోపాల్ వ్యవహరించారు. మూడేళ్ల కొకసారి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా ఆర్.సుబ్రహ్మణ్యం, జనరల్ సెక్రటరీగా కె.మల్లేశ్వరరావు, ట్రెజరర్‌గా వై.ఆదిలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పి.శ్యాంసుందర్, పి.ధనంజయరావు, వి.శ్రావణి, రఘునాథరావు, జాయింట్ సెక్రెటరీగా యు.ప్రీతి, పి.శ్రీనివాసరావు, ఎస్.రమేష్, ఎల్.రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను జి.సోమేశ్వరరావు, జి.చక్రవర్తి, బి.భవాని, హరికుమార్‌లు పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫార్మసీ అధికారులు హాజరయ్యారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఫార్మసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం